సాక్షి సిద్దిపేట

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024

కలిసికట్టుగా.. వాట్సాప్ జట్టుగా



సండే స్పెషల్

ఉరుకుల పరుగుల జీవనంలో పక్కవారినే కాదు.. అయిన వారిని కూడా పట్టించుకోని రోజులివి. ఎవరికి ఏమైతే నాకేంటి? వారికి సాయం చేస్తే నాకే లాభం అనుకునే వారెందరో.. కానీ తెల్లాపూర్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీల వాసులు అలా ఆలోచించలేదు. వారికొచ్చిన సరికొత్త ఆలోచనతో అందరూ కలిసి 10 వరకు వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేశారు. ఒక్కో గ్రూపులో సుమారు 600 నుంచి 700 మంది వరకు సభ్యులు ఉంటారు. ఈ ప్రాంతాల్లో 100 కిపైగా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు ఉండగా ఎవరికి సమస్య వచ్చినా గ్రూపులో పోస్ట్ చేస్తారు. అందులోని సభ్యులు వెంటనే స్పందిస్తారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : 8లో

రేపు పోలీసు కమిషనర్ అనురాధతో 'సాక్షి' ఫోన్ ఇన్





సిద్దిపేటకమాన్: నూతన సంవత్సర వేడుకలకు యువతి, యువకులతో పాటు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పోలీసు అధికారులు నూతన సంవత్సర వేడుకల్లో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఈవెంట్ల నిర్వహణ అనుమతి, జిల్లా కేంద్రంతో పాటు కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల తనిఖీ, ట్రాఫిక్ ఆంక్షలు, ఇతర నిబంధనలు, అంశాలపై మీకు అనుమానాలు, సందేహాలను నేరుగా సిద్దిపేట పోలీసు కమిషనర్ డాక్టర్ అనురాధ దృష్టికి తీసుకెళ్లే అవకాశం 'సాక్షి' మీకు కల్పించింది. సోమవారంసాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమంలో కమిషనర్‌తో మాట్లాడి విషయాన్ని నేరుగా తెలుసుకోవచ్చు.

సోమవారం
సమయం: మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు

ఫోన్ చేయాల్సిన ఫోన్ నంబర్

87126 67306

పంచాయతీ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఇబ్బందికరంగా ఉన్న మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం కనీస వేతనాలను అమలు చేయాలన్నారు. ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. లేకుంటే నూతన సంవత్సరం మొదటి వారంలోనే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

– సిద్దిపేటరూరల్

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



నల్లదుస్తులు ధరించి సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తుండగా.. 19వ రోజైన శనివారం నల్లదుస్తులు ధరించి, కలెక్టరేట్ వద్ద రోడ్లు ఊడ్చుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన తెలిపారు. ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేసి, ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బాలకిషన్, నవీన్‌కుమార్, కరుణాకర్, కృష్ణవేణి, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

– సిద్దిపేటరూరల్

శనీశ్వరుడికి తైలాభిషేకం



తైలాభిషేకం చేస్తున్న భక్తులు

శనిత్రయోదశి మహోత్సవ సందర్భంగా వర్గల్ విద్యాసరస్వతి శనీశ్వర క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో శనివారం తెల్లవారుజామున మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. పూర్ణకలశ మండపంలో భక్తులు బారులుదీరగా వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. అనంతరం మూలవిరాట్‌కు తిలతైలం సమర్పించి, శనిదోషం తొలగించాలని ప్రార్థించారు. జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

– వర్గల్(గజ్వేల్)

బీఆర్ఎస్ కోటలో.. బీజేపీ పాగా

లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీగా గెలుపొందిన రఘునందన్



కాలగమనంలో మరో ఏడాది కలిసిపోతోంది. సంవత్సరం ఆరంభంలో లోక్‌సభ ఎన్నికలు, ఆ తర్వాత జిల్లాలో చర్చకు తెరతీసిన రాజకీయ పరిణామాలను ఒక్కసారి పరిశీలిద్దాం.. 2024లో మెదక్ లోక్‌సభ ఎన్నికలు జరగగా బీజేపీ అభ్యర్థి ఎంపీగా గెలుపొందారు. ఈ ప్రాంతం బీఆర్ఎస్‌కు కంచుకోట కాగా బీజేపీ పాగా వేసింది. ఈ స్థానంలో ఏ పార్టీ గెలుస్తుందోనని రాష్ట్ర ప్రజలంతా ఎదురుచూశారు. ఇక స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పదవీకాలం ముగియడంతో మాజీలయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా నామినేటెడ్ పదవులను పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదు. కాంగ్రెస్ నాయకులు ఏడాదిగా ఆశగా ఎదురు చూస్తున్నారు.

- అభ్యర్థుల తరఫున ప్రచారం చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్
- సిద్దిపేటలో రుణమాఫీ ఫ్లెక్సీల రచ్చ
- 'నామినేటెడ్' పదవుల కోసం ఆశావహుల ఎదురుచూపులు

సాక్షి, సిద్దిపేట: డిసెంబర్ 2న ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో హిందూస్థాన్ కోకాకోలా బేవరేజెస్ కంపెనీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి వర్గీయులను లోపలికి రానివ్వకుండా, పీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ రావు అనుచరులను లోపలికి సీఎం వెంట వెళ్లనిచ్చారని నర్సారెడ్డి బయటకు వచ్చారు. సీఎం లోపల ఉండగానే నర్సారెడ్డి తన వర్గీయులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఇలా సీఎం ఎదుటే వర్గ పోరు బయటపడింది.

మాజీలైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

ఈ జూన్ 3తో మండల పరిషత్ అధ్యక్షులు, జూన్ 4తో జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్, జెడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. జనవరిలో సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలం ముగయడంతో మాజీలు అయ్యారు. 499 గ్రామ పంచాయతీలకు, 23 మండలాలకు ప్రత్యేక అధికారులను కలెక్టర్ నియమించారు. స్థానిక సంస్థల్లో ప్రత్యేక పాలన ప్రారంభమైంది.



రుణమాఫీ రచ్చ

రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని ఆగస్టు 15 కల్లా పూర్తి చేసినందున ఎమ్మెల్యే పదవీకి హరీశ్‌రావు రాజీనామా చేయాలని ఆగస్టు 16న సిద్దిపేటలో కాంగ్రెస్ కార్యకర్తలు పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బీఆర్ఎస్ నాయకులు తొలగించి నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం బోర్డు కేసీఆర్, హరీశ్ రావు చిత్రపటాలతో ఉన్న ఫ్లెక్సీని పలువురు కాంగ్రెస్ నాయకులు చించివేశారు. ఇలా రైతు రుణ మాఫీ రచ్చ లేపింది.

మెదక్ వైపు అందరి చూపు

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ప్రజల చూపు అంత ఒక్కసారిగా మెదక్ వైపు తిప్పింది. అందుకు కారణం గజ్వేల్ నుంచి మాజీ సీఎం కేసీఆర్, సిద్దిపేట నుంచి మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ అసెంబ్లీ స్థానాలు ఈ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోకి వస్తాయి. మే 13న ఎన్నికలు జరిగితే జూన్ 4న ఫలితాలు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుపై 39,139 ఓట్ల మెజార్టీతో ఎంపీగా మాధవనేని రఘునందన్ గెలుపొందారు. అనూహ్యంగా మెదక్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల ప్రచారంలో రఘునందన్ రావుకు మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరఫున సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు.



సిద్దిపేటలో బీజేపీ బహిరంగ సభకు హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా(ఫైల్)

నిరాశలో కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ నాయకుల్లో నిరాశగానే ఉన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నామినేటెడ్ పదవుల పంపకాలు ఇంకా పూర్తి కాలేదు. జిల్లాలో 14 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా ఇప్పటి వరకు ఐదు మార్కెట్‌లకే పాలకవర్గాలను నియమించారు. సుడా(సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌ల కోసం పోటా పోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. అక్టోబర్ 17న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా హుస్నాబాద్‌కు చెందిన కేడం లింగమూర్తిని నియమించారు. జిల్లాలో పూర్తి స్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీ చేయకపోవడంతో ఎంతో ఆశగా నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు పరిష్కరించాల్సిందే

విద్యుత్‌శాఖ అధికారులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమావేశంలో హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ట్రాన్స్‌ఫార్మర్‌ల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు.. విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. వచ్చే వేసవిలో పంటల సాగుకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. తమ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు కావాలని రైతులు దరఖాస్తులు చేసుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం సిద్దిపేట నియోజకవర్గంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం గ్రామాలకు చెందిన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే విఠలాపూర్‌లో 30, రాంపూర్‌లో 15, ఈవిధంగా నియోజకవర్గంలో 200 వరకు రైతుల నుంచి దరఖాస్తులొచ్చాయని నియోజకవర్గంలోని రంగనాయకసాగర్‌లో నీరు పుష్కలంగా ఉన్నాయన్నారు. సిద్దిపేట విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వెట్టర్లు, దుప్పట్లు పంపిణీ

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వసతి, గురుకులాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లోని విద్యార్థులకు పవనసుతయూత్ సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు, స్వెటర్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు.

కోమటి చెరువు ప్రాంతంలో టీటీడీ నిర్మాణం

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట ప్రాంతం గొప్ప ఆధ్యాత్మికతకు, ధార్మికతకు నెలవు అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని వేద భవన్‌లో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం గోదాదేవి కల్యాణం, సుదర్శన యాగం నిర్వహించారు. కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడారు. వేద భవన్ వికాస తరంగిణి భవనం రూ. 45 లక్షలతో అద్భుతంగా నిర్మించుకోవడం గొప్ప విషయమన్నారు. సిద్దిపేటలో టీటీడీ ఆధ్వర్యంలో కోమటి చెరువు ప్రాంతంలో తిరుపతి శ్రీవారి ఆలయాన్ని నిర్మించుకోబోతున్నామన్నారు. త్వరలో రూ. 10 కోట్ల నిధులు మంజూరవుతాయన్నారు.

పనుల్లో పారదర్శకత లోపిస్తే సహించను

నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుదర్శన్‌రెడ్డి



వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుదర్శన్‌రెడ్డి, అధికారులు తదితరులు

కొండపాక(గజ్వేల్): జాతీయ రహదారి పనుల నిర్వహణలో పారదర్శకత లోపిస్తే సహించేది లేదంటూ నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుదర్శన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేట నుంచి సిరిసిల్లా వరకు నేషనల్ హైవే పనులు నిర్వహిస్తుండగా.. చేర్యాల నుంచి కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డు వరకు చేసిన పనులను శనివారం పరిశీలించారు. వెలికట్ట క్రాస్ రోడ్డుకు ఇరువైపుల ఏర్పాటు చేసిన గ్రిల్స్, వర్షపు నీరు వెళ్లేందుకు కాలువ నిర్మాణ పనుల విషయంలో ఆర్అండ్ బీ శాఖ అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాప్‌లో చూపబడిన డిజైన్ ప్రకారం కాకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేస్తుండటాన్ని చూస్తుంటే అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం అవుతుందంటూ మండిపడ్డారు. రోడ్డుపై ఇరువైపుల వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాలువల్లో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ఎలా శుభ్రం చేసుకోవాలన్న ఆలోచన లేకుండా మూతలను పెట్టి వెల్డింగ్ చేయడం ఎక్కడైనా చేశారా? అంటూ ప్రశ్నించారు.

న్యూస్‌రీల్


మన్మోహన్ హయాంలోనే చరిత్రాత్మక చట్టాలు



సంతాప సభలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

హుస్నాబాద్: దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలోనే చరిత్రాత్మక చట్టాలను రూపొందించారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో శనివారం మాజీ ప్రధాని సంతాప సభ నిర్వహించారు. మన్మోహన్ హయాంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టం, విద్యా హక్కు చట్టం, గృహ హింస నిరోధక చట్టం, సమాచార హక్కు చట్టం వంటి చట్టాలను రూపొందించారన్నారు. జాతీయ స్థాయిలో ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారన్నారు. సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, నాయకులు ఉన్నారు.

మాజీ ప్రధాని మృతికి నివాళి



మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న కౌన్సిలర్లు

చేర్యాల(సిద్దిపేట): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం పట్టణ పరిధిలో మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, పట్టణ అభివృద్ధి వంటి అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగేందర్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, జుబేద ఖాతున్, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, పచ్చిమడ్ల సతీశ్, కో–ఆప్షన్ సభ్యులు జేబా బేగం, ఆరోగ్యరెడ్డి, నాగేశ్వరరావు, మేనేజర్ ప్రభాకర్, ఏఈ శ్రీనాథ్, టీపీఓ కళ్యాణ్ చక్రవర్తి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

సిద్దిపేటరూరల్: జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా దామోదర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. జనగామ జిల్లా హౌసింగ్ జిల్లా నోడల్ అధికారిగా పనిచేసిన దామోదర్‌రావు సిద్దిపేట జిల్లా హౌసింగ్ పీడీగా బదిలీపై వచ్చారు. ఆ స్థానంలో పనిచేసిన తాత్కాలిక నోడల్ అధికారి శ్యాంప్రసాద్ రెడ్డి సేవలు నేటితో ముగిశాయి. నూతన పీడీని శాఖ అధికారులు సూపరింటెండెంట్, సీఏ ల్‌టీసీలు స్వాగతించి సన్మానించారు.

మా టీచర్లు మాకే కావాలి



గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో ఉన్న కేజీబీవీ వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు

- కేజీబీవీల వద్ద విద్యార్థుల నిరసనలు
- నచ్చచెప్పిన ప్రత్యేకాధికారులు

వర్గల్(గజ్వేల్): కస్తూర్బా గురుకులం ఎదుట విద్యార్థినులు బైఠాయించారు. డిప్యూటేషన్ టీచర్లు మాకొద్దన్నారు. మా టీచర్లే మాకు కావాలంటూ నినదించారు. శనివారం వర్గల్ కేజీబీవీ వద్ద విద్యార్థినుల నిరసన కొనసాగింది. 19 రోజులుగా సర్వ శిక్షా ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. ఇందులో వర్గల్ కేజీబీవీ స్పెషలాఫీసర్, ఇతర టీచర్లు కూడా ఉన్నారు. శనివారం నెంటూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ సుజాతను డిప్యూటేషన్‌పై పంపించారు. ఉదయం ఆమెను విద్యార్థినులు లోపలికి రాకుండా అడ్డుకున్నారు. స్పెషలాఫీసర్ ఫోన్‌లో విద్యార్థినులకు నచ్చచెప్పడంతో నిరసన విరమించారు.

గజ్వేల్ రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మెబాట పట్టగా బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో ఉన్న కేజీబీవీలోని 350 మంది విద్యార్థినులకు ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉన్నారు. అది కూడా తల్లిదండ్రులు ఆందోళన దిగడంతో మరో పాఠశాలకు చెందిన టీచర్‌ను ఇన్‌చార్జిగా పంపించారు. 19 రోజులుగా ఉద్యోగులంతా సమ్మెలో పాల్గొంటున్నారు. పాఠాలు బోధించేవారు లేకుండా పోయారు. దీంతో ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్షా అభియాన్‌లో విధులు నిర్వహించే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దుబ్బాకటౌన్: మాకు పాత ఉపాధ్యాయులే కావాలని దుబ్బాక కస్తూర్బా గాంధీ విద్యాలయం ఎదుట శనివారం విద్యార్థులు నిరసనకు దిగారు. ఉపాధ్యాయులు సమ్మెలో ఉన్న నేపథ్యంలో కొత్త ఉపాధ్యాయులను నియమించడంపై విద్యార్థులు ఆందోళ చేపట్టారు. పాత టీచర్లనే కొనసాగించాలని పాటల రూపంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ విద్యార్థులను సముదాయించి తరగతి గదిలోకి పంపారు.



దుబ్బాక: నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రారండోయ్ వేడుక చూద్దాం

నేడు మల్లన్న కల్యాణం

- తోటబావి వద్ద ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న మంత్రులు

మల్లన్న, మేడాలదేవి, కేతమ్మదేవిల కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరగనుంది. జిల్లావాసులే గాక తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరానున్నారు. ప్రభుత్వం తరఫున మంత్రులు హాజరై పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించనున్నారు.



మల్లన్న కల్యాణానికి ముస్తాబైన మండపం

కొమురవెల్లి(సిద్దిపేట): నేడు జరిగే మల్లన్న, మేడాలదేవి, కేతమ్మ దేవిల కల్యాణ మహోత్సవం కనుల విందుగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. కొమురవెల్లిలోని ఆలయ తోటబావి వద్ద గల కల్యాణ మండపాన్ని సుందరంగా అలంకరించారు. ఉదయం 10.45 గంటలకు స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం వీరశైవ ఆగమశాస్త్ర సంప్రదాయ ప్రకారం జరగనుంది. కాశీ పీఠాధిపతి 1008 జగద్గురు మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య పర్యవేక్షణలో స్థానిక పూజారుల మంత్రోచ్చారణల మధ్య జరుగుతోంది.

స్వామి తరుపున పడిగన్నగారి వంశస్తులు

మొదట ఆలయ గర్భగుడిలో మల్లన మూలవిరాట్ వద్ద కల్యాణ తంతు ప్రారంభిస్తారు. తోట బావి వద్ద ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపిస్తారు. గర్భగుడిలో మూల విరాట్, తోటబావి వద్ద జరిగే కల్యాణ మహోత్సవంలో వధువు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మ తరుపున మహదేవుని వంశస్తులు కల్యాణ ఘట్టంలో పాల్గొంటారు. వరుడు మల్లికార్జున స్వామి తరుపున పడిగన్నగారి వంశస్తులు వివాహ పెద్దలుగా వ్యవహరిస్తారు.

పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రులు

ప్రతీసంవత్సరం సంక్రాంతి పండుగకు ముందు జరిగే మల్లన్న కల్యాణానికి ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, సమర్పించడం ఆనవాయితీ. ఈ ఏడాది పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు మంత్రులు పొన్నం, సురేఖ, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు రానున్నారు. స్వామి వారి కల్యాణం సజావుగా జరిగేందుకు 12 మంది ప్రత్యేక అధికారులను నియమించారు.

పటిష్ట బందోబస్తు

అడిషనల్ ఏఆర్ డీసీపీ రామచంద్రరావు



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రామచంద్రారావు, ఏసీపీ సతీశ్ తదితరులు

మల్లన్న కల్యాణానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. శనివారం బందోబస్తుకు వచ్చిన పోలీసులకు దిశానిర్దేశం చేశాం. అడిషనల్ డీసీపీలు 2, ఏసీపీలు 6, సీఐలు 25 మంది, ఎస్ఐలు 26, కానిస్టేబుల్‌లు మొత్తం 361 సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నాం. భక్తులు పోలీసులకు సహకరించి పార్కింగ్ ప్రదేశాలలోనే వాహనాలను పార్కు చేయాలి. 75 సీసీ కెమెరాలతో నిఘా పెట్టాం. తోటబావి సమీపంలో వీఐపీ పార్కింగ్. సిద్దిపేట, చేర్యాల, కిష్టంపేట నుంచి వచ్చే వాహనాదారులు బస్టాండ్ పక్కన గల పార్కింగ్ ప్రదేశంలో పార్క్ చేయాలి. కొండపోచమ్మ, హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు పెట్రోల్ పంపు, శ్రీహోటల్ వెనుక గల ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేయాలని అడిషనల్ ఏఆర్ డీసీపీ రామచంద్రరావు తెలిపారు.

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ


విచారణ చేస్తున్న ఏసీపీ పురుశోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ గ్రామంలో గతంలో దళితులపై దాడి నేపథ్యంలో శనివారం గజ్వేల్ ఏసీపీ పురుశోత్తంరెడ్డి మరోమారు విచారణ చేపట్టారు. కేసు విచారణ కొనసాగుతున్న తరుణంలో కొందరు బాధితులను, సాక్షులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు చేశారు. దీంతో తొగుట సీఐ లతీఫ్‌తో కలిసి గజ్వేల్ ఏసీపీ పురుశోత్తం రెడ్డి ముద్దాపూర్ గ్రామంలో విచారణ చేశారు. ఎంక్వైరీ రిపోర్టునుపై అధికారులకు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, పోలీసులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్కూటీకి నిప్పు


దహనమైన స్కూటీ

దుబ్బాకటౌన్: ఇంటి ఎదుట పార్క్ చేసిన స్కూటీని గుర్తు తెలియని దుండగుడు నిప్పంటించి పరారయ్యాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. లచ్చపేట 11వ వార్డుకు చెందిన ఎం.డీ ముస్తఫా రోజు మాదిరిగానే తన స్కూటీని శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట పార్క్ చేశాడు. తెల్లవారు జామున లేచి చూసేసరికి స్కూటీ పూర్తిగా కాలిపోయింది. బాధితుడు స్థానికుల సహాయంతో సీసీ కెమెరాలో చూడగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి స్కూటీ పై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారైనట్లు కనిపించింది. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొల్చారం(నర్సాపూర్): పోతంశెట్టిపల్లి శివారు మంజీరా నదిలో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఏఎస్ఐ తారాసింగ్ కథనం మేరక.. పోతంశెట్టిపల్లి శివారు నుంచి ఏడుపాయలకు వెళ్లే దారిలో మొదటి బ్రిడ్జి సమీపంలోని నది పాయలో గుర్తు తెలియని 44 ఏళ్ల వ్యక్తి మృతదేహం కనిపించింది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్ఐ గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి శరీరంపై ఎరుపు రంగు బనియన్, నలుపు రంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. పోతంశెట్టిపల్లి పంచాయతీ కార్యదర్శి అరుంధతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహిళను బ్లాక్ మెయిల్

వ్యక్తిపై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ వివాహితను బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ ఘటన అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌భాస్కర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాము, విక్రమ్ ఇద్దరూ స్నేహితులు. రాము భార్యను విక్రమ్ ఫోన్ ద్వారా బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరిస్తున్నాడు. రెండ్రోజుల కిందట మాట్లాడే విషయం ఉందంటూ పిలిపించి ఇద్దరు పరస్పరం దాడికి దిగారు. ఈ దాడిలో రాముకు గాయాలు అయ్యాయి. శనివారం రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కలిసికట్టుగా.. వాట్సాప్ జట్టుగా..


తెల్లాపూర్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీ కాలనీ

సండే స్పెషల్

ఉరుకుల పరుగుల జీవనంలో పక్కవారినే కాదు.. అయిన వారిని కూడా పట్టించుకోని రోజులివి, ఎవరికి ఏమైతే నాకేంటి? వారికి సాయం చేస్తే నాకే లాభం అనుకునే వారెందరో.. కానీ గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు అలా ఆలోచించలేదు. కలిసి ఉంటే కలదు సుఖం.. ఒకరికొకరు చేసుకునే సాయంలో ఆనందాన్ని వెతుక్కున్నారు. ఆలోచన వచ్చిన వెంటనే వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. ఆ గ్రూపుల్లో ఎవరు ఏ సాయం కోరినా స్పందిస్తూ చేయూత తనివ్వడానికి ముందుకు వస్తూ సమాజంలో మానవత్వం ఇంకా మిగిలి ఉందని నిరూపిస్తున్నారు.

పర్చా శ్రీనాథ్
– రామచంద్రాపురం (పటాన్‌చెరు):

- వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమస్యల పరిష్కారం
- గేటెడ్ కమ్యూనిటీ వాసుల వినూత్న ఆలోచన
- వైద్యం, ఉద్యోగం, సెక్యూరిటీ, రవాణా కోసం సెపరేట్ గ్రూపులు
- ఒక్క మెసేజ్‌తో స్పందిస్తూ చేయూత
- తోచిన సాయం చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ
- కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా సహాయం
- ఒక్కో గ్రూపులో 600 నుంచి 700 మంది

హైదరాబాద్ నగరానికి శివారు ప్రాంతం కావడంతో తెల్లాపూర్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ ప్రాంతాలకు మంచి డిమాండ్ వచ్చింది. దీంతో ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద నిర్మాణ సంస్థలు భారీ ఎత్తున నిర్మాణాలు ప్రారంభించారు. దీంతో ఈ ప్రాంతంలో 100పైగా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు వచ్చాయి. ఇందులో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఐటీ ఉద్యోగులు, వ్యాపారస్తులు, ప్రభుత్వ ఉద్యోగులున్నారు. ఈ కాలనీలలో సుమారు 70 శాతం ఉత్తర భారతదేశంకు చెందిన వారు ఉండగా మిగిలిన 30 శాతం మంది తెలుగు రాష్ట్రాల వారు నివసిస్తున్నారు.

సుమారు 4.5 లక్షల మంది నివాసం..

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 45 గేటెడ్ కమ్యూనిటీ కాలనీలున్నాయి. అందులో సుమారు 2లక్షల జనాభా నివాసం ఉంటున్నారు. అమీన్‌పూర్ పరిధిలో సుమారు 25 గేటెడ్ కమ్యూనిటీ కాలనీలున్నాయి. అందులో సుమారు లక్ష జనాభా నివసిస్తున్నారు. పటాన్‌చెరు పరిధిలో సుమారు 31పైగా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలున్నాయి అందులో 1.50 లక్షల మంది నివాసం ఉంటున్నారు.


చెరువు పరిసరాలను శుభ్రం చేస్తూ..

కలిసికట్టుగా ఉద్యమాలు

కమ్యూనిటీ కాలనీవాసులు ఐక్యంగా ఉంటూ స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేసి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. రోడ్డు, తాగునీరు సమస్యలను పరిష్కరించుకున్నారు. చెరువుల పరిరక్షణకు గతంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు చెరువు పరిసరాలను శుభ్రం చేశారు.


సమస్యల కోసం ఉద్యమిస్తున్న కాలనీవాసులు

వాట్సాప్ గ్రూపుతో సమస్య పరిష్కారం

గేటెడ్ కమ్యూనిటీ వాసులు అందరూ కలిసికట్టుగా ఉంటూ వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని వారి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఈ గ్రూపులలో వందలాది మంది ఉండటంతో ఎవరికైన సమస్య వచ్చిన వెంటనే గ్రూపులో పోస్ట్ చేస్తారు. దీనికి అందరూ స్పందించి ముందుకొచ్చి సమస్యను పరిష్కరిస్తున్నారు. కులం, మతం, ప్రాంతీయ భేదం లేకుండా అందరూ కలసికట్టుగా సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. సుమారు 10 వరకు వాట్సాప్ గ్రూపులు ఉంటాయి. ఒక్కో గ్రూప్‌లో 600 నుంచి 700 మంది వరకు ఉంటారు.

వైద్య సేవలకు డాక్టర్ సపోర్ట్ గ్రూపు



అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించడానికి డాక్టర్స్ సపోర్ట్ గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రూపులో 40 మందికి పైగా వైద్యులు ఉన్నారు. ఎవరికైనా అత్యవసర సమయంలో ఈ గ్రూపులో మెసేజ్ చేసిన వెంటనే వైద్యులు స్పందించి వారికి మందులను, వైద్య సూచనలను ఇస్తున్నారు. ఆపరేషన్ చేయించుకోనే వారు సెకండ్ ఒపీనియన్ కోసం ఈ గ్రూపులోని వైద్యులను సంప్రదిస్తున్నారు. ప్రధానంగా కోవిడ్ సమయంలో వందలాది మంది ఎంతో ప్రయోజనం పొందారు.

ఉద్యోగాలు, కెరీయర్ గైడెన్స్




గేటెడ్ కమ్యూనిటీ కాలనీ వాసులు ఆయా కాలనీల్లో నివసించే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ఒక గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఎక్కువగా ఐటీ నిపుణులు ఉంటారు. ఎవరికైనా ఉద్యోగంలో సమస్య వచ్చిన వెంటనే సీనియన్ ఐటీ నిపుణులు వారికి సూచనాలు, సలహాలతోపాటు కెరీయర్ గైడెన్స్ చేస్తుంటారు. అదే విధంగా విద్యాభ్యాసం పూర్తి చేసిన వారు ఎవరైనా ఉంటే అవకాశాన్ని బట్టి వారికి ఉద్యోగాలు వచ్చే విధంగా ఇందులోని వారు తమ వంతు కృషి చేస్తున్నారు.

రవాణా కోసం కారుపూల్..



ఈ గ్రూపు ద్వారా కమ్యూనిటీ కాలనీవాసులు రవాణా సేవలు పొందుతున్నారు. కాలనీలోని వారు ఎక్కడికన్న వెళ్లాలంటే ఈ గ్రూపులో వారు వెళ్లే ప్రాంతం పేరును మెసేజ్ చేస్తారు. వెంటనే ఆ ప్రాంతానికి కారులో వెళ్లే వారు స్పందించి వారిని పికప్ చేసుకొని వారు వెళ్తున్న మార్గంలో డ్రాప్ చేస్తారు. ఉచితంగానే సేవలు అందిస్తున్నారు. ట్రాఫిక్, కాలుష్య నివారణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు వాపోతున్నారు.



పోలీసులతో సెక్యూరిటీ గ్రూపు..

గేటెడ్ కమ్యూనిటీ కాలనీ వాసులు కలిసి ఒక సెక్యూరిటీ గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో అన్ని కాలనీలకు చెందిన సెక్యూరిటీ ఇన్‌చార్జిలు, పోలీసు అధికారులు ఇందులో ఉంటారు. ఏ కాలనీలోనైనా దొంగతనం గానీ ఏదైన ఘటన జరిగినప్పుడు వెంటనే ఈ గ్రూపులో పోస్ట్ చేస్తారు. దీంతో ఇతర కాలనీవాసులు అప్రమత్తం అవుతారు. స్థానికంగా ఏ సమస్య వచ్చిన, ట్రాఫిక్ జామ్ అయినా ఈ గ్రూపులో మెసేజ్ చేస్తే వెంటనే పోలీసు అధికారులు స్పందించి సమస్యను పరిష్కారిస్తున్నారు.

వెంటనే స్పందిస్తున్నారు



ఉద్యోగరీత్యా ఒరిస్సా నుంచి 1996లో హైదరాబాద్‌కు వచ్చాను. 2017లో తెల్లాపూర్ పరిధిలో ఇళ్లు కొనడం జరిగింది. ఇక్కడి ప్రజలు చాలా మంచి వారు. తమను ఎంతో ఆదరిస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన వెంటనే స్పందిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– అమిత్ చౌదరి

కలిసిమెలిసి ఉంటాం



గేటెడ్ కమ్యూనిటీ కాలనీ వాసులం అందరం కలిసిమెలిసి ఉంటాం. ఒకరికి ఒకరం సహాయ సహకారాలు అందించుకుంటాం. పండుగలను, వన భోజన కార్యక్రమాలను కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరం కలిసి నిర్వహించుకుంటాం.

– రామ్‌కుమార్, తెల్లాపూర్

పరిచయం లేకుండానే సాయం



గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులందరం కలిసి ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పరిచయాలే లేకుండానే సాయం చేసుకుంటున్నాం. ఐక్యంతోనే అనేక సమస్యలు పరిష్కారించుకున్నాం.

– ఈశ్వరగారి రమణ,
తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఉచిత వైద్య శిబిరాలు

కమ్యూనిటీ కాలనీవాసులు ఈ ప్రాంతంలోని వారి కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. గతంలో వేలాది మంది వలస కార్మికుల కోసం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతీ కాలనీవాసులకు సీపీఆర్‌పై శిక్షణ అందించారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమలు నిర్వహించారు.


సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం

నా చావుకు తల్లిదండ్రులే కారణం

లేఖ రాసి ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య


శ్రావణి(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): ఉరేసుకొని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ మండల పరిధిలోని జానకంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీ కథనం మేరకు.. జానకంపల్లి గ్రామానికి చెందిన దివిటి మల్లయ్య కుమార్తె శ్రావణి(17) మెదక్ కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. 22న గ్రామంలో బోనాల పండుగకు వచ్చింది. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనా స్థలంలో తన చావుకు తల్లిదండ్రులే కారణమంటూ లేఖలో రాసి చనిపోయింది. ఇదిలా ఉండగా దివిటి మల్లయ్య మొదటి భార్య ఇందిర పదేళ్ల కిందట చనిపోగా అదే గ్రామానికి చెందిన జ్యోతిని రెండో వివాహం చేసుకున్నాడు. ఇద్దరు ఆడ పిల్లల పెళ్లిళ్లు చేయగా చిన్న కూతురు శ్రావణి మెదక్ కస్తూర్బాలో విద్యనభ్యసిస్తుంది. తన చెల్లి మృతికి తండ్రి మల్లయ్య, జ్యోతిలే కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి అక్కలు స్రవంతి, ఆకృతి మెదక్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో రైతు..

దౌల్తాబాద్(దుబ్బాక): అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ కథనం మేరకు.. గ్రామానికి కానుగుల రమేశ్ (45), శ్యామల దంపతులు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రమేశ్ అనారోగ్యానికి గురి కాగా వైద్య ఖర్చులకు అప్పులు చేశాడు. అలాగే ఇటీవల నిర్మాణం చేపట్టి మరికొంత అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫైనాన్స్ ఏజెంట్లు బైక్ తీసుకెళ్లారని.. మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): బైక్ ఫైనాన్స్ కట్టకపోవడంతో ఏజెంట్లు వాహనాన్ని తీసుకెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్న శంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పిల్ల నాగరాజు(35) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఫైనాన్స్‌లో బైక్ తీసుకొని కిస్తీలు కట్టడం లేదు. బుధవారం ఏజెంట్లు వచ్చి బైక్ తీసుకెళ్లిపోయారు. దీంతో మనస్తాపం చెంది గ్రామంలోని కుమ్మరికుంట వద్ద గడ్డి మందు తాగి విషయాన్ని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. భార్య నవనీత అక్కడికి చేరుకొని అపస్మారక స్థితిలో పడి ఉన్న భర్తను మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వ్యక్తి..


అశోక్‌గౌడ్ మృతదేహం

శివ్వంపేట(నర్సాపూర్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గున్నల అశోక్‌గౌడ్(35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అశోక్ గౌడ్ భార్య శ్యామల అనారోగ్య సమస్యతో ఆస్పత్రికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం మీర్జాపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ కథనం మేరకు.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన రోమాల చంద్రయ్య భార్య యాదమ్మతో కలిసి శుక్రవారం రుద్రారం గ్రామంలోని బంధువుల ఇంటికొచ్చారు. తిరుగు ప్రయాణంలో మీర్జాపల్లి వద్ద ఎక్స్‌ఎల్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. యాదమ్మ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు దయాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి..


నర్సింలు మృతదేహం

కొండపాక(గజ్వేల్): చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందాడు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం మేరకు.. కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పోకల నర్సింలు (43) అప్పుడప్పుడు చెరువులో చేపలు పట్టేందుకు వెళ్తుంటాడు. శనివారం ఉదయం చేపలు పట్టడానికి వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వస్తుండటంతో అనుమానంతో చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువులో మునిగి మృతి కనిపించాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

దుబ్బాక వాసికి అరుదైన పురస్కారం

- డాక్టర్ పన్యాల మహేందర్‌రెడ్డికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు
- గవర్నర్ చేతుల మీదుగా అందజేత


జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ మహేందర్‌రెడ్డి

దుబ్బాక: దుబ్బాక పట్టణానికి చెందిన డాక్టర్ పన్యాల మహేందర్‌రెడ్డి అరుదైన పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లో జరిగిన ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టర్ మహేందర్‌రెడ్డి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును శుక్రవారం రాత్రి అందుకున్నారు. ప్రస్తుతం 85 ఏళ్ల వయస్సు పైబడిన మహేందర్‌రెడ్డి వైద్యుడిగా 60 ఏళ్లకు పైగా ప్రజలకు ఎన్నో రకాలుగా సేవలు అందించారు. అవార్డుతోపాటు ఘనంగా సత్కరించారు. అవార్డు రావడంపై దుబ్బాక ప్రాంత కాంగ్రెస్ నాయకులు అందె రాజిరెడ్డి, సంజీవరెడ్డి, మూర్తి నరేశ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి స్వాధీనం

బిహార్ వ్యక్తి అరెస్ట్


నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): గంజాయి విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడి చేసి బిహార్‌కు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు.ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. రామాయంపేట ఎక్సైజ్ సీఐ ఎన్.రాణి కథనం మేరకు.. మండల కేంద్రంలోని రాధాస్టీల్ పరిశ్రమ సమీపంలో బిహార్ రాష్ట్రంలోని జౌతలీ గ్రామానికి చెందిన రాజేశ్ రిషిదేవ్ గంజాయి విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 190 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ విజయ్ సిద్ధార్థ, హెచ్‌సీ దుర్గారెడ్డి, కానిస్టేబుల్ వెంకటేశం, స్వామి, దినేష్, శ్రీకాంత్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సావిత్రీబాయి పూలే ఆదర్శం

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్


మాట్లాడుతున్న నోముల శ్రీకాంత్

మెదక్ మున్సిపాలిటీ: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ టీచర్లను త్వరలో ఘనంగా సన్మానిస్తామని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్ తెలిపారు. శనివారం ఐబీ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వచ్చే నెల 3న సావిత్రీబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహిస్తామన్నారు. అలాగే జిల్లాలోని 194 మంది అంగన్వాడీ టీచర్లను, మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిస్తామన్నారు. దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందిన సావిత్రీబాయి పూలే మహిళలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు , ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, జాతీయ అధ్యక్షుడు కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు పాల్గొంటారని తెలిపారు. అనంతరం బీసీ సంఘం నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చింతల నర్సింహులు, సంఘం గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగారం, ప్రధాన కార్యదర్శి గుండు మల్లేశం, ముఖ్య కార్యదర్శి ఎల్లాపురం మల్లేశ్, నాయకులు మోహన్ చారి, తదితరులు పాల్గొన్నారు.

టైర్ పగిలి కారు బోల్తా

- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- మెదక్ చర్చికి వెళ్తుండగా ప్రమాదం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

హవేళిఘణాపూర్(మెదక్): టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి కారు బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మెదక్ మండలం మంభోజిపల్లి శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన బాల్‌రాజ్ భార్య విశ్రాంతమ్మ(64) కుటుంబ సభ్యులతో కలిసి మెదక్ చర్చికి వస్తున్నారు. మెదక్ మండలం మంభోజిపల్లి శివారులోకి రాగానే టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విశ్రాంతమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రి బాల్‌రాజ్, కుమారుడు బాబురావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఏఎస్ఐ వెంకటయ్య తెలిపారు.

స్లాబ్ మిల్లర్ ట్రాక్టర్

13 మంది కూలీలకు గాయాలు


ప్రమాదంలో చెల్లాచెదురుగా మిల్లర్ సామగ్రి

వెల్దుర్తి(తూప్రాన్): స్లాబ్ మిల్లర్ ట్రాక్టర్ బోల్తా పడి పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మాసాయిపేట మండలం హకీంపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. వర్గల్ మండలం అనంతగిరిపల్లి గ్రామ వెంకటేశంకి చెందిన స్లాబ్ మిల్లర్ ట్రాక్టర్ చిన్నశంకరంపేట మండలం సూరారంలో ఓ ఇంటికి స్లాబ్ వేయడానికి కూలీలతో కలిసి మాసాయిపేట మీదుగా వెళ్తుంది. హకీంపేట శివారులోకి రాగానే ట్రాక్టర్ బంపర్ ఊడిపోయి మిల్లర్ టైర్ల కిందకు రావడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. మిల్లర్ వాహనం భాగాలు చెల్లాచెదురుగా పడడంతో సుమారు 13 మంది కూలీలు గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనాల్లో తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించిన అనంతరం తీవ్రగాయాలైన మాసాయిపేట గ్రామానికి చెందిన రవి, సాయిలు వర్గల్ మండలం వేలూర్‌కు చెందిన మల్లేశ్, మంజుల, సాయికుమార్, మధు, యాదమ్మ, నరేశ్‌లను వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంతో నడపడం వల్లే ప్రమాదం సంభవించిందని తెలిసింది. ఘటనపై ఎస్ఐ రాజును వివరణ కోరగా ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.